సాక్షి రంగారెడ్డి

గురువారం । 25 । జనవరి । 2024



అందరి చూపు..

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టాలని 13 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 8లో ▸



ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న డ్రైవరను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8లో ▸



నిందితుల రిమాండ్

తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దోపిడీకి పాల్పడిన నిందితులను మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో ▸

బకాయిలు కట్టాల్సిందే



హెచ్‌డీసీసీబీ కార్యాలయం

రుణాల వసూలుకు హెచ్‌డీసీసీబీ స్పెషల్ డ్రైవ్

- ఉమ్మడి జిల్లాలో రంగంలోకి మూడు ప్రత్యేక టీంలు
- మొత్తం రూ.1,800 కోట్ల బకాయిలు
- చెల్లించని రైతుల ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం
- ఇటీవలి సమీక్షలో మంత్రి తుమ్మల స్పష్టమైన ఆదేశాలు

యాచారం: హైదరాబాద్ (రంగారెడ్డి) జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు పొందిన రైతుల నుంచి బకాయిలు వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్‌కు ప్రత్యేక టీంలు రంగంలోకి దిగుతున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో(వికారాబాద్, మేడ్చల్ జిల్లాలు)ని లక్ష 20వేల మంది రైతులకు హెచ్‌డీసీసీబీ బ్యాంకు వివిధ పద్దుల కింద కొన్నేళ్ల నుంచి మొత్తం రూ.1,800 కోట్ల రుణాలు ఇచ్చింది. ఆయా మండలాల్లో ఉన్న పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)ల నివేదిక ప్రకారం దీర్ఘకాలిక, స్వల్పకాలిక, బంగారు నగల తాకట్టు, చిరు వ్యాపారులకు ఇలా పలు పద్దుల కింద రుణాలు ఇచ్చింది. దీర్ఘకాలికం కింద పౌల్ట్రీ, డెయిరీఫాంలు, గొర్రెలు, మేకల పెంపకం కోసం రుణాలు ఇవ్వగా.. స్వల్ప కాలికం కింద వ్యవసాయ పంటలకు పెట్టుబడుల కింద, జీవనోపాధుల కల్పన కోసం చిరువ్యాపారులకు, బంగారు తాకట్టు కింద రుణాలిచ్చారు. అయితే కోవిడ్ నేపథ్యంలో రెండు, మూడేళ్లుగా హెచ్‌డీసీసీబీ టార్గెట్ పూర్తికావడం లేదు. ఇచ్చిన రుణాలకు వడ్డీలు, చక్రవడ్డీలు కలిపి రూ.కోట్లల్లోకి చేరడంతో అధికారులు వసూళ్లకు ఉపక్రమించారు. తాజాగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మొండిబకాయిలపై కఠినంగా వ్యవహరించాలని, వసూలు చేయని అధికారులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అధికారులు బకాయిల వసూళ్లపై దృష్టి సారించారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో హెచ్‌డీసీసీబీ ఇచ్చిన రుణాల వివరాలు
మొత్తం రైతుల సంఖ్య: 2,50,432
మొత్తం పీఏసీఎస్‌లు: 51
హెచ్‌డీసీసీబీ బ్రాంచ్‌లు: 30
రైతులకు ఇచ్చిన రుణాలు: రూ.1,800 కోట్లు
2024 మార్చి 30లోపు వసూలు చేయాల్సిన బకాయి టార్గెట్: రూ.488 కోట్లు
దీర్ఘ, స్వల్పకాలిక రుణాలతో పాటు పలురకాల రుణాలు పొందిన రైతుల సంఖ్య: లక్షా 20వేలు

మూడు ప్రత్యేక టీంలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రైతులకు ఇచ్చిన రూ.1,800 కోట్ల రుణాల్లో మార్చి 30లోపు రూ.488 కోట్లు వసూలు చేయాలని హెచ్‌డీసీసీబీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మూడు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లాలో హెచ్‌డీసీసీబీ డీజీఎం ఉదయశ్రీ ఆధ్వర్యంలో, వికారాబాద్ జిల్లాలో హెచ్‌డీసీసీబీ డీజీఎం సత్యప్రసాద్ ఆధ్వర్యంలో, మేడ్చల్‌లో ఉదయశ్రీ, సత్యప్రసాద్ (హెచ్‌డీసీసీబీ డీజీఎం) ఆధ్వర్యంలో బృందాలు బకాయిల వసూళ్లకు దిగనున్నాయి. మార్చి 30లోపు వసూలు చేయాల్సిన రూ.488 కోట్ల టార్గెట్‌కు గాను ఈనెల 20వరకు దాదాపు రూ.150 కోట్ల వరకు వసూలు చేశారు. ఇంకా రూ.338 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అధికారులు నేరుగా రైతులు మార్టిగేషన్ చేసిన వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి దీర్ఘకాలిక రుణాలు తీసుకుని దేనికి ఖర్చు చేశారు.. పౌల్ట్రీ, డెయిరీ ఫాంలు, మేకలు, గొర్రెల పెంపకంతో ఆర్థిక ప్రగతి సాధ్యమవుతోందా.. తీసుకున్న రుణాలను దుర్వినియోగం చేశారా అనే వివరాలు సేకరిస్తున్నారు. రైతుల పేర్ల మీద పీఏసీఎస్‌లు, హెచ్‌డీసీసీబీ సిబ్బంది ఏమైనా బినామీ రుణాలు పొందారా అనే వివరాలపైనా ఆరా తీస్తున్నారు.

రికవరీ స్పెషల్ డ్రైవ్ టీంలు
రంగారెడ్డి : ఉదయశ్రీ (హెచ్‌డీసీసీబీ డీజీఎం)
వికారాబాద్: సత్యప్రసాద్ (హెచ్‌డీసీసీబీ డీజీఎం)
మేడ్చల్: ఉదయశ్రీ, సత్యప్రసాద్ (హెచ్‌డీసీసీబీ డీజీఎంలు)

నవంబర్‌లోనే నోటీసులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ పద్దుల కింద రుణాలు పొంది బకాయిలు చెల్లించని రైతులకు ఇప్పటికే పీఏసీఎస్‌ల ద్వారా డిమాండ్ నోటీసులు పంపించారు. దాదాపు 85వేల మంది రైతులకు గతేడాది నవంబర్‌లోనే స్థానిక పీఏసీఎస్‌ల సిబ్బంది ద్వారా నోటీసులు జారీ చేయించారు. మార్చి 30లోపు వడ్డీతో సహా బకాయి మొత్తం చెల్లించాలని.. లేని పక్షంలో ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఆమనగల్లు డివిజన్లలో 400మందికి పైగా రైతులు రూ.200 కోట్లకు పైగా దీర్ఘకాలిక రుణాలు పొందారు. అత్యధిక బకాయిలున్న ఇబ్రహీంపట్నం డివిజన్‌పై ఇప్పుడు అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మరో రెండు, మూడు రోజుల్లో స్పెషల్ టీంలు బకాయిల వసూళ్లకు ఇక్కడ తిష్ఠ వేయనున్నారు. బకాయిలు కట్టనివారిపై చర్యలు తప్పవంటున్నారు.

బకాయిలు చెల్లించాలి



బకాయిలున్న రైతులు మార్చి 20లోపే వడ్డీతో సహా చెల్లించాలి. వంద శాతం బకాయిల వసూల్ల కోసం మూడు స్పెషల్ టీంలు ఏర్పాటు చేశాం. పీఏసీఎస్‌లు ఇచ్చిన నోటీసుల ప్రకారం స్పెషల్ టీంలు రైతుల వద్దకెళ్లి బకాయిల వసూళ్లకు కృషి చేస్తాయి. చెల్లించని రైతుల విషయంలో చట్ట ప్రకారం ముందుకు వెళ్లాల్సి ఉంటుంది.

– సత్తయ్య, హెచ్‌డీసీసీబీ చైర్మన్



బఫర్ జోన్‌లో నిర్మించిన ప్రహరీని కూల్చివేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఆక్రమణల తొలగింపు

నందిగామ: వాగుకు ఆనుకొని బఫర్ జోన్‌లో నిర్మించిన ప్రహరీని అధికారులు తొలగించారు. బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'వాగునూ వదల్లేదు' కథనానికి అధికారులు స్పందించారు. సర్వేయర్ భీమ్లానాయక్, ఆర్‌ఐ రోజా, ఇరిగేషన్ ఏఈ కార్తీక్.. చంద్రాయన్‌గూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల మధ్యలో ఉన్న వాగును సందర్శించారు. సర్వే నంబరు 1452లోని భూమిని సర్వేచేసి బఫర్ జోన్‌లో కొంతమేరకు ఆక్రమించి ప్రహరీని నిర్మించారని గుర్తించారు. జేసీబీ సహాయంతో కూల్చివేశారు. దీంతో వాగునీరు యథావిధిగా అక్కమ్మ చెరువులోకి వెళ్లేందుకు మార్గం సుగుమమైంది. ఆక్రమణల తొలగింపునకు 'సాక్షి' చూపిన చొరవను స్థానికులు అభినందించారు.

కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

షాద్‌నగర్: కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని.. వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని కుంట్లరాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి వంశీచంద్‌రెడ్డి, మక్తల్, దేవరకద్ర, జడ్చర్ల, కల్వకుర్తి ఎమ్మెల్యేలు శ్రీహరి, మధుసూధన్‌రెడ్డి, అనిరుథ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ... కార్యకర్తలు, నాయకుల సమష్టి కృషి ఫలితంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాచాటుదామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటయ్యే అవకాశాలు ఉన్నాయని చల్లా అన్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకును బీజేపీకి మలిపేందుకు ఆ పార్టీ నేతలు యత్నిస్తున్నట్లు తమకు సమచారం ఉందన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, వెంకట్‌రాం రెడ్డి, బాబర్‌ఖాన్, ప్రియాంక, తిరుపతి రెడ్డి, చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, తాండ్ర విశాల, శ్రవణ్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, రఘు, బాల్‌రాజ్‌గౌడ్, శివశంకర్ గౌడ్, జమ్రుద్ ఖాన్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'ఐఎస్‌ఎల్'లో సత్తాచాటిన విద్యార్థినులు



అంజలి



వైష్ణవి

మొయినాబాద్‌రూరల్: ఐఎస్‌ఎల్ చాంపియన్‌షిప్ పోటీల్లో చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారని వెస్ట్ రీజియన్ ఆర్‌సీఓ డాక్టర్ శారదావెంకటేష్, ప్రిన్సిపాల్ రమాదేవి పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ..ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌లో జరిగిన ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యా సంస్థ గిరిజన విద్యాసంస్థ, మైనార్టీ విద్యా సంస్థ, మహాత్మ జ్యోతి బాపూలే విద్యా సంస్థ, కస్తూర్బా విద్యా సంస్థలు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. అండర్-17 కబడ్డీ పోటీల్లో చేవెళ్ల గురుకుల పాఠశాలకు చెందిన అంజలి (9వ తరగతి) జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించిందని తెలిపారు. అథ్లెటిక్స్ అండర్-14 విభాగంలో ఎస్.వైష్ణవి (7వ తరగతి) 100 మీటర్ల రన్నింగ్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుందని తెలిపారు. అక్కడి స్పోర్ట్స్ అధికారి రామ్‌లక్ష్మణ్, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల కార్యదర్శి నవీన్ నికోలాస్.. అంజలి, వైష్ణవిని ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ఇబ్రహీంపట్నం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వ్యాసరచన, పాటలు, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర పోటీలను నిర్వహించనున్నట్లు ఆర్డీఓ అనంత రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్లు, మండల విద్యాధికారుల ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించడంతో పాటు ఓటరు అవగాహన ర్యాలీలను నిర్వహిస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తుక్కుగూడ: ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అధ్యక్షుడు కందుకూరి శ్రీనివాస్ అన్నారు. ఆ సంఘం రంగారెడ్డి జిల్లా శాఖ వారు రూపొందించిన నూతన సంవత్సర(2024) క్యాలెండర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి వెంకటేష్,నాయకలు..నాగయ్య,యాదగిరి,బీసీరెడ్డి, బెనర్జీ, మహేష్‌రెడ్డి, శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమస్యలపై పోరాటం

క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ రమేష్



నియామకపత్రం అందుకుంటున్న రమేష్

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లో బుధవారం నిర్వహించిన తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమావేశంలో ఆ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా చైర్మన్‌గా బంగారి రమేష్ ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర చైర్మన్ జిలుకర రవికుమార్ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్న రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర కోసం క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో పోరాటు చేశామని గుర్తు చేశారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం దాదాపు పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. క్రైస్తవులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. క్రిస్టియన్ భవనం నిర్మిస్తామని మాట ఇచ్చి మొండిచేయి చూపారని తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రిస్టియన్లకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం పెద్దలకు రమేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోచైర్మన్ సారయ్య, రాష్ట్ర నాయకులు రత్నరాజు తదితరులున్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి
- ముగిసిన లీడ్ ఎర్త్ లీడర్ శిక్షణ కార్యక్రమం

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా.. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నిర్వహిస్తున్న 'లీడ్ ఎర్త్ లీడర్' శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ నేటితరంపై ఉన్న సామాజిక బాధ్యత అని.. విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దీనిని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. మనచుట్టూ ఉన్న గాలి, నీరు, భూమి కాలుష్యం కాకుండా చూడాలని కోరారు. తదనంతరం పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అతిథులు ప్రసంగించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, పర్యావరణ వేత్త జేఎస్‌ఆర్ అన్నమయ్య, విశ్రాంత భూగర్భ శాస్త్రవేత్త హరిసర్వోత్తం, వ్యవసాయ శాస్త్రవేత్త మహేశ్, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్, ఉపాధ్యాయులు రమేశ్, వేణుగోపాల్, దీపిక, సీజీఆర్ ప్రతినిధులు వెంకటేశ్, బీరేశ్, లక్ష్మీప్రసన్న, నగేశ్, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎలుకగూడెంలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి, నాయకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి, ఎలుకగూడెం తదితర గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను ఆయన ప్రాంభించారు. అదేవిధంగా మూత్తూట్ ఫైనాన్స్ సహకారంతో చౌదరిగూడ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మూత్రశాలలు, కిషెన్‌షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమాజ అభ్యున్నతిలో స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ, జెడ్పీటీసీ స్వరూప, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆ పథకాన్ని కొనసాగించాలి

- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య

కడ్తాల్: రాష్ట్రంలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసహాయం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల ఉమేశ్ అధ్యక్షతన మండల పరిధిలోని మైసిగండిలో బుధవారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆశయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సహాయం పథకం కోసం ఆన్‌లైన్ ద్వారా లక్ష 25వేల మంది రజక వృత్తిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఉండటానికి సొంత ఇల్లులేక దుర్భర జీవితాన్ని గడుపుతున్న రజక వృత్తిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంటి స్థలం లేనివారికి ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరారు. రజక ఫెడరేషన్‌కు నూతన పాలకవర్గాన్ని నియమించి రాబోయే బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న మోడ్రన్ ధోబీఘాట్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల ఉమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నగేశ్, చంద్రకళ, శోభ, అర్వింద్, నర్సింహ, శ్రీనివాస్, బాలరాజ్, రాజశేఖర్, జంగయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



రజక వృత్తిదారుల సంఘం నాయకులతో ఆశయ్య

ఉప్పల్ మ్యాచ్‌కు భారీ భద్రత

సీపీ సుధీర్‌బాబు వెల్లడి







సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ మైదానం నిఘా నీడలోకి వెళ్లిపోయింది. నేటి నుంచి ఈ నెల 29 వరకు భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య టెస్ట్ మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో రాచకొండ పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతి భద్రతల పోలీసులతో పాటు ఆక్టోపస్, ట్రాఫిక్, ఆర్మ్‌డ్ ఫోర్స్, ఎస్‌బీ, సీసీఎస్, ఎస్‌ఓటీ, ఐటీ సెల్ వంటి అన్ని ప్రత్యేక విభాగాల నుంచి 1,500 పోలీసు బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేసినట్లు బుధవారం రాచకొండ కమిషనర్ జి.సుధీర్‌బాబు వెల్లడించారు. మైదానం చుట్టూ, 360 సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. గేట్ నంబరు–1 కేవలం ఆటగాళ్ల కోసమే కేటాయించాం. మ్యాచ్‌కు 3 గంటల ముందు మాత్రమే వీక్షకులకు మైదానంలోకి అనుమతిస్తారు. మ్యాచ్ సమయంలో రహదారులు, కూడళ్లలో సాధారణ ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు 250 మంది పోలీసులు విధుల్లో ఉంటారు. టీఎస్ ఐలా, జెన్‌ప్యాక్ట్, ఎన్‌జీఆర్‌ఐ ప్రాంతాలలో 15 పార్కింగ్ ప్లేస్‌లను ఏర్పాటు చేశాం. మ్యాచ్ సమయంలో ఎల్బీనగర్, వరంగల్ మార్గం నుంచి హబ్సిగూడ మీదుగా భారీ వాహనాలకు ప్రవేశం లేదు. ఈ నెల 29 వరకు ఉదయం 7:30 నుంచి రాత్రి 7:30 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని సీపీ సుధీర్‌బాబు పేర్కొన్నారు.

వీరాభిమాని వచ్చే...

భారత జట్టు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ క్రికెట్ మ్యాచ్ ఆడినా వాలిపోయే వీరాభిమాని సుధీర్ గౌతమ్ చౌదరీ హైదరాబాద్‌కూ వచ్చేశాడు. బుధవారం ఉప్పల్ స్టేడియంలో అతను తనదైన శైలిలో భారత్–ఇంగ్లండ్ టెస్టు సిరీస్ కోసం శంఖనాదం పూరించాడు. సచిన్ టెండూల్కర్‌కు అతిపెద్ద ఫ్యాన్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఈ బిహారీ... సచిన్ రిటైర్మెంట్ తర్వాత కూడా ఆటపై తన ప్రేమను కొనసాగిస్తూ ప్రతీ మైదానంలో కనిపిస్తూ వస్తున్నాడు.

నల్ల చట్టాలను వ్యతిరేకించాలి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

మంచాల: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి కోరారు. బుధవారం మంచాల మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా కొత్తగా కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకువస్తుందన్నారు. నల్ల చట్టాలను ఉపసంహరించుకుంటావ ఇదివరకే పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం హామీ కూడా ఇచ్చిందన్నారు. నేడు వాటిని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయ ప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, జంగయ్య, యాదయ్య, పాండు, మాధవి, సరిత, అలివేలు ,శ్రీనివాస్‌రెడ్డి, అజయ్ బాస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చేవెళ్ల: చేవెళ్లలో వేరువేరు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న పది మందిని ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్, నాంచేరి గ్రామాల్లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్‌లో కొందరూ పేకాట ఆడుతున్నట్లు ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక పోలీసులతో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అదుపులోని తీసుకున్నారు. మరోచోట నాంచేరి సమీపంలో కూడా పేకాట ఆడుతున్నట్లు తెలియటంతో అక్కడ దాడులు చేయగా పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. రెండు చోట్ల మొత్తం 10 మంది పేకాటరాయుళ్లు పట్టుబడినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.60 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంబులెన్స్ తనిఖీ

రికార్డులు పరిశీలించిన 108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వసంత్ పాపయ్య


రికార్డులు పరిశీలిస్తున్న వసంత్ పాపయ్య

మహేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 108 అంబులెన్స్ వాహనాన్ని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వసంత్ పాపయ్య మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న రికార్డులను పరిశీలించి పైలట్, టెక్నీషియన్‌లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి తగు సలహాలు, సూచనలు అందించారు. 108 వాహనానికి ఫోన్ చేసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు సరైన ప్రథమచికిత్స అందించాలని మేనేజర్ సూచించారు. కార్యక్రమంలో టెక్నీషియన్ మహేశ్, పైలెట్ కృష్ణ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

భర్త, అత్త వేధింపులు భరించలేక భవనం నుంచి దూకిన మహిళ


తార మృతదేహం

మొయినాబాద్: అదనపు కట్నం కోసం కుటుంబసభ్యులు వేధించడంతో ఓ వివాహిత నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలుకూరులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు రాజీవ్ గృహకల్పలో నివాసముండే కాడిగళ్ల రాజు కూమార్తె తార(21)ను అక్కడే నివాసముంటున్న గున్నడి రాహుల్‌కి ఇచ్చి మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేశారు. కొంత కాలంగా భర్త, అత్త అదనపు కట్నం తీసుకురావాలని తారను వేధిస్తున్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె బుధవారం రాజీవ్ గృహకల్ప భవనం నాలుగో అంతస్తు నుంచి కిందికి దూకింది. వెంటనే గమనించిన స్థానికులు ఆమెను ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం తార మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

కడ్తాల్: అక్రమ మార్గంలో కృత్రిమంగా ఇసుకను తయారు చేసి విక్రయించేందుకు వెళుతున్న ఓ ట్రాక్టర్‌ను విశ్వసనీయ సమాచారంతో పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం మండల పరిధిలోని ముద్విన్ గ్రామ సమీపంలో అక్రమంగా కృత్రిమ ఇసుకను తయారు చేసి ఆమనగల్లులో విక్రయించేందుకు వెళుతున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను ముందస్తు సమాచారం మేరకు పోలీసులు పట్టుకొని వాహన డ్రైవర్‌ను విచారించగా ఎలాంటి అనుమతులు లేవని తేలింది. దీంతో వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఆ గ్రామ సమీపంలో ఫిల్టర్ ఇసుక తయారీ ప్రదేశంలో మరో ట్రాక్టర్ ట్రాలీని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇసుక ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అందరి చూపు.. అవిశ్వాసం వైపు

గత కొంత కాలంగా ఉత్కంఠ రేపుతున్న ఆదిబట్ల మున్సిపాలిటీ అవిశ్వాసంపై కౌన్సిలర్లు ఆత్రుతగా ఉన్నారు. చైర్మన్ పీఠంపై కొత్తవారిని ఎప్పుడు ఆసీనులు చేద్దామని ఎదురు చూస్తున్నారు. దానికి అనుగుణంగా క్యాంపు రాజకీయాలు, నేతల ప్రసన్నం, ప్రలోభాలకు తెర లేపారు.

- ఉత్కంఠ రేపుతున్న ఆదిబట్ల మున్సిపాలిటీ
- తేదీ కోసం ఎదురుచూస్తున్న కౌన్సిలర్లు
- ప్రసన్నం చేసుకుంటున్న ఆశావహులు


ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ కుర్చీపై నేతల కన్ను పడింది. ఇప్పటికే అవిశ్వాసం కోసం మున్సిపాలిటీలోని 13 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అవిశ్వాసం నోటీసులు జారీ చేయాలని ఎదురుచూస్తున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం తేదీ ప్రకటనపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మున్సిపాలిటీలో మొత్తం 15 కౌన్సిలర్లు ఉన్నారు. మరో 5 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు సైతం పాలకవర్గం సభ్యులుగా ఉన్నారు. 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన కౌన్సిలర్ బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుతో చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం ఏడాది గడవక ముందే కాంగ్రెస్ గూటికి చేరారు. అప్పటి నుంచి నేటి వరకు ఒంటెద్దు పోకడ కారణంగా చైర్‌పర్సన్‌కు అందరూ కౌన్సిలర్లు దూరమయ్యారు. దీంతో విసిగిపోయి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసానికి పట్టుబట్టారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆదిబట్ల చైర్మన్, వైస్ చైర్మన్‌ను తొలగించాలని ఏకంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన 13 మంది కౌన్సిలర్లు జనవరి 5వ తేదిన జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాసం పెట్టాలని ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి 30 రోజుల్లో నోటీసులు అందజేయాలి. కానీ నేటికీ అందకపోవడంతో చర్చనీయాంశంగా మారింది.

అందని నోటీసులు

ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను తొలగించాలని ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి జిల్లా కలెక్టర్ గడువు ఇవ్వాలి. కానీ నేటికీ 20 రోజులు గడుస్తున్న నోటీసులు అందజేయడం లేదు. ఓ వైపు అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత చైర్‌పర్సన్ సైతం అవిశ్వాసం వీగిపోవడానికి ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారు. కాంగ్రెస్‌లో ఉన్న ప్రజాప్రతినిధులు సైతం నోటీసులు ఇవ్వొద్దని ఒత్తిడి తీసుకొస్తున్నారు. అలాగే కొత్తగా చైర్మన్ కావడానికి అధికార పార్టీ కౌన్సిలర్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సభ్యులందరూ చైర్మన్, వైస్ చైర్మన్‌లను తొలగించి కొత్తవారిని ఎన్నుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

పీఠంపై కన్నేసిన మర్రి

ఆదిబట్ల చైర్మన్ కుర్చీపై 9వ వార్డు కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి కన్నేశారు. గతంలో చైర్మన్ కావడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఎక్స్ అఫిషియో సభ్యులతో కుర్చీకి దూరమయ్యారు. ప్రస్తుతం మళ్లీ ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారు. అన్ని పార్టీల కౌన్సిలర్లు నిరంజన్‌రెడ్డికే మద్దతు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న చైర్మన్‌కు ఇద్దరు మద్దతు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే క్యాంపులకు బయలుదేరినట్లు సమాచారం. తేదీ ప్రకటన చేయగానే ఆదిబట్లకు వచ్చి కుర్చీ కైవసం చేసుకోవాలని చూస్తున్నారు.

చోరీ కేసులో నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కాశీవిశ్వనాథ్

రూ.6.83 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

మీర్‌పేట: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులను మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర నాందేడ్ పట్టణానికి చెందిన షేక్ అమీర్(25) బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మల్లాపూర్ బాబానగర్‌కు చెందిన షేక్ ఫిరోజ్(25)తో కలిసి గతంలో పలు కేసుల్లో ఇద్దరు నిందితులుగా జైలు జీవితం గడిపారు. నిజామాబాద్ ఆటోనగర్‌కు చెందిన అమీర్(23)తో వీరిద్దరికి పరిచయం ఏర్పడింది. షేక్‌అమీర్, అమీర్‌లు నగరానికి వచ్చి బాబానగర్‌లోని ఫిరోజ్ ఇంట్లో ఉంటూ బైకుపై కాలనీల్లో తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకునేవారు. ఈ నెల 13న అల్మాస్‌గూడ విశాఖనగర్‌లో నివాసముండే మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏఈగా విధులు నిర్వహించే శ్రీనివాసులు మధ్యాహ్నం ఇంటికి తాళాలు వేసి వనస్థలిపురం వెళ్లి తిరిగి వచ్చేసరికి షేక్ అమీర్, ఫిరోజ్, అమీర్‌లు తాళాలు పగులగొట్టి ఇంట్లోని రూ.11 లక్షల నగదును దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి మంగళవారం సాయంత్రం మీర్‌పేట నందిహిల్స్ వద్ద షేక్ అమీర్, ఫిరోజ్‌లను అదుపులోకి తీసుకుని రూ.6 లక్షల 83 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అమీర్ పరారీలో ఉండగా ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో డీఐ వై.జీ.నాయుడు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళను పునరావాసానికి తరలింపు


సత్యమ్మ

ఆమనగల్లు: ఆమనగల్లులో తిరుగుతున్న గుర్తు తెలియని మహిళను గుర్తించిన పోలీసులు ఆమెను పునరావాస కేంద్రానికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం రాత్రి పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు బస్టాండ్ ఆవరణలో ఓ మహిళ కనిపించింది. తన పేరు సత్యమ్మ అని చెబుతున్న ఆమె మిగితా వివరాలేవీ చెప్పలేకపోతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆమెను రాజేంద్రనగర్‌లోని మహిళా పునరావాస కేంద్రానికి తరలించారు. మహిళ వివరాలు తెలిసిన వారు ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ బల్‌రాం సూచించారు.

మూసీపై డ్రోన్ సర్వే

సాక్షి, సిటీబ్యూరో: ఓ వైపు మూసీ సుందరీకరణ, మూసీ పరిసరాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించగా.. మరోవైపు మూసీ పొడవునా ఉన్న ఇళ్లు, ఆక్రమణలు తదితరమైనవి గుర్తించే పనులకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. నగరంలో ఎప్పుడు వర్షం కురిసినా లోతట్టు ప్రాంతాలు..ముఖ్యంగా మూసీ వెంబడి ఉన్న బస్తీలు,ఇళ్లు జలమయమవుతున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలకు తీరని నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో సమస్య శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో మూసీ బఫర్‌జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? తదితరమైనవి తెలుసుకోనున్నారు. ఇందుకు గాను డ్రోన్ సర్వే చేయించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

100 చదరపు కిలోమీటర్ల పరిధిలో సర్వే

గ్రేటర్ నగరంలో మూసీ ప్రవహించే మార్గం దాదాపు 55 కి.మీ.లు కాగా, 100 చదరపుకిలోమీటర్ల మేర ఈ డ్రోన్ సర్వే నిర్వహించనున్నారు. డ్రోన్ ద్వారా బఫర్‌జోన్, గరిష్టవరద ప్రాంతాల సరిహద్దులతో పాటు వాటిల్లో ఇళ్లు, ఆక్రమణలు, తదితరమైనవి గుర్తిస్తారు. ఈ సర్వే అంచనా వ్యయం దాదాపు రూ. 50 లక్షలు.15 రోజుల్లో సర్వే పూర్తి చేయాలనేది లక్ష్యం.

నేపథ్యం..

మూసీపై డ్రోన్‌సర్వేకు సంబంధించి ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు కారణమని చెప్పుకోవచ్చు. మూసీపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగరంలో మూసీ ప్రవహిస్తున్న మేర అభివృద్ధి చేయాలని సూచించడంతో పాటు మూసీ పరిసరాల్ని ఆదాయ వనరులుగా,పర్యాటక,ఉపాధి కల్పన ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. గత వారం లండన్‌లో పర్యటించినప్పుడు అక్కడి థేమ్సనది అభివృద్ధి జరిగిన తీరు గురించి స్థానిక అధికారులు, నిపుణులను అడిగి తెలుసుకున్నారు.

పోలీసుల కస్టడీకి అఖిలేష్

అబిడ్స్: అబిడ్స్ ఫార్చ్యూన్ లాడ్జిలో హైటెక్ వ్యభిచారం కేసులో యజమాని అఖిలేష్‌ను విచారించేందుకు అబిడ్స్ పోలీసులకు కస్టడీ ఇచ్చేందుకు కోర్టు అనుమతించింది. నాలుగు రోజుల క్రితం రాంనగర్ ప్రాంతానికి చెందిన అఖిలేష్ అబిడ్స్‌లోని లాడ్జిలో వెస్ట్‌బెంగాల్ నుంచి యువతులను తీసుకువచ్చి హైటెక్ వ్యభిచారం చేస్తూ పోలీసులకు చిక్కారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు ఆధ్వర్యంలో అఖిలేష్‌ను, యువతులను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా అఖిలేష్‌పై పలు అనుమానాలు ఉండడం, సినీ, రాజకీయ నాయకులకు అఖిలేష్‌తో సత్సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించి విచారించేందుకు పోలీసు కస్టడీ కోరగా..కోర్టు అనుమతించింది.

వర్సిటీ మాజీ జేఆర్ కన్నుమూత

సాక్షి, సిటీబ్యూరో: రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ (జేఆర్) టి.శేషారెడ్డి (91) బుధవారం కన్నుమూశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన సేవలు అందించారు. యూనివర్సిటీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించారు. ఆయన కుమారుడు మాజీ ఐపీఎస్ అధికారి శశిధర్‌రెడ్డి హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి రాష్ట్రంలో కీలక బాధ్యతలు నిర్వహించారు.

సీసీ కెమెరాలకూ అందని వేగం..

- దూసుకొచ్చి బైక్‌ను ఢీకొన్న కారు
- బౌన్సర్ మృతి

బంజారాహిల్స్: అదుపుతప్పిన వేగంతో వెనుక నుంచి దూసుకొచ్చిన కారు ఢీకొట్టి ఓ బౌన్సర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుధవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ సిక్ విలేజ్ గాంధీనగర్‌కు చెందిన లింగాల తారక్‌రామ్ (30) మాదాపూర్ నోవాటెల్‌లో బౌన్సర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం డ్యూటీకి వెళ్లి బుధవారం తెల్లవారుజామున బైక్‌పై జూబ్లీహిల్స్ మీదుగా ఇంటికి వెళ్తున్నాడు. పెద్దమ్మ గుడి సమీపంలోకి రాగానే శ్రీ జ్యువెలర్స్ మలుపు వద్ద వెనుక నుంచి అతివేగంగా దూసుకువచ్చిన బ్లాక్ కలర్ కారు ఢీకొట్టి ఆగకుండా దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తారక్‌రామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు తారక్‌రామ్‌కు రెండేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్ల కొడుకు ఉన్నాడు. గత కొంతకాలంగా బౌన్సర్‌గా పని చేస్తున్నాడు. ప్రమాదానికి కారణమైన కారు కోసం జూబ్లీహిల్స్ పోలీసులు గాలింపు చేపట్టారు. గచ్చిబౌలి, మాదాపూర్ వైపు, జూబ్లీహిల్స్, పంజగుట్ట, బేగంపేట రోడ్లపై ఉన్న సీసీ ఫుటేజీలను వడబోస్తున్నారు. సీసీ కెమెరాలకు కూడా అందనంత స్పీడ్‌గా 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో కారు దూసుకెళ్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ వేగానికి కారు నంబర్ ఏ ఒక్క కెమెరాలో కూడా చిక్కడం లేదు. కారులో ఎంత మంది ఉన్నారని స్పష్టం తెలియడం లేదు. కారులో ఎంతమంది ఉన్నారు.. వీరు ఎక్కడి నుంచి వస్తున్నారు.. అన్నది తెలియాల్సి ఉంది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి బంధువుల ఆందోళన

నిందితుడ్ని ఇంతవరకు అరెస్టు చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ మృతుడి కుటుంబసభ్యులు బుధవారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేయడమే కాకుండా ఈ ఘటనకు కారకుడైన నిందితుణ్ణి తమ ముందు ప్రవేశపెట్టాలని, కారును కూడా చూపించాలని డిమాండ్ చేశారు. తారక్‌రామ్ తల్లి రాజమణి, భార్య సుధారాణి, సోదరుడు గణేష్, బావలు ప్రదీప్, సునీల్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో బంధుమిత్రులు మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి కన్నీరుమున్నీరవుతూ తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌తోనే 'పాలమూరు'కు జాతీయ హోదా

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణ శివారులోని కుంట్ల రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పిన నాటి సీఎం కేసీఆర్ హామీలు నెరవేరలేదన్నారు. కనీసం తట్టెడు మట్టిని కూడా ఎత్తిపోయలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటే ప్రాజెక్టు జాతీయ హోదా సాధించడం సులభం అవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. గతంలో బీఆర్‌ఎస్ నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ నేతలను అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. అయినా బెదరకుండా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు ఎంతో కృషి చేశారన్నారు. ఎంపీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు తగిన విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం

షాద్‌నగర్‌రూరల్: ఆడపిల్లలను రక్షించి వారికి ఉన్నత విద్యను అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సీడీపీఓ నాగమణి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. కుటుంబ అభివృద్ధిలో ఆడపిల్లల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. బాలికలకు ఉన్నత విద్యను అందిస్తే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. సమాజంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులు, అత్యాచారాలు, హత్యలను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఆడపిల్లలను భారంగా భావించకుండా ఇష్టంగా పెంచాలని, భవిష్యత్‌పై నిర్ణయాన్ని తీసుకునే పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలన్నారు. ఆడపిల్లలను చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయకుండా మంచి విద్యను అందించాలని అన్నారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ తాండ్రవిశాల శ్రవణ్‌రెడ్డి, ఎంపీపీ ప్రియాంక, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, కౌన్సిలర్ పావనినర్సింలు, విజయలక్ష్మి, రాధిక, మహేంద్ర, హర్షవర్ధిని, గోపాల్‌రెడ్డి, సహదేవ్, మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.